చినుకు పడితే.. జలమయమే

- చిన్నపాటి వర్షానికే రహదారులపై వర్షపునీరు
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరించని కాలువలు, రోడ్లు
- కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో ముందుకు సాగని మురుగునీరు
- ఆక్రమణలతో కుంచించుకు పోయిన కాలువలు
- ఆదోని వాసులకు తప్పని అవస్థలు


జలమయమైన ప్రధాన రహదారి

ఆదోని సెంట్రల్: పట్టణంలో కొద్దిపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు మొదలుకొని ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. మురుగు కాలువలు నిండి వర్షపునీటితో కలిసి రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు మొదలుకొని అయా కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువల విస్తరణ చేపట్టి నీరు సజావుగా వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. మున్సిపాలిటీకి పన్నుల రూపంలో భారీగానే ఆదాయం వస్తున్నా పనులు మాత్రం చేపట్టండ లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దాశాబ్దాల క్రితం నిర్మాణం

పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 2లక్షలకు పైబడి జనాభా ఉంది. పట్టణంలో దాదాపు 160 నుంచి 180 కిలోమీటర్లు మేర మురుగు కాలువలు, 13 నుంచి 15 కిలో మీటర్లు మేర వంకలు ఉన్నాయి. పట్టణంలో దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా కాలువలు నిర్మించారు. రోజు రోజుకు పట్టణం విస్తరించడం , జనాభా పెరగడంతో ప్రస్తుత అవసరాలకు డ్రైనేజీలు సరిపోవడంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు కలగకూడదని కాలువలు, వంకలకు వర్షాకాలానికి ముందుగానే పూడికతీత పనులను చేపట్టేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పూడికతీత పనులు చేపట్టడంలేదు.

చెత్తంతా కాలువల్లోనే..

కాలువల్లో చెత్త చెదారం నిల్వ ఉండటంతో వర్షం కురిసినప్పుడల్లా నీరు సాఫీగా ముందుకు వెళ్లడం లేదు. దీంతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లు మీదకు వచ్చి చేరుతుండటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు మురుగు కాలువలు అక్కడక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయాయి. పైగా దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చెదారం వంటివి కాలువలోకి వేయడంతో మురుగు కాలువలకు అడ్డం పడుతున్నాయి. మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త చెదారం తొలగించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. పన్నుల రూపంలో పురపాలక సంఘానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్న డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు మాత్రం చేపట్టండం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

వర్షం కురిసినప్పుడల్లా పట్టణంలోని అయా వార్డులతో పాటు 167 జాతీయ రహదారిపైన మోకాళ్లలోతు వర్షపు నీరు పారుతాయి. హన్నాజీ పేటలోని దుకాణాలు, ఇళ్ల ముందు నీరు నిల్వ ఉంటున్నాయి. దీంతో జనాలు ఇళ్ల నుంచి బయటికి రావాలి అంటేనే ఇబ్బందులకు గురవుతున్నారు.


ఓ కాలనీలో నిలిచిన మురుగు నీరు

రైతు బజార్‌లోతట్టు ప్రాంతంలో ఉండడంతో నీరంతా అందులోకి చేరుతున్నాయి. దీంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదోని రైల్వే ట్రాక్ అకాశవంతెన కింది భాగంలోని మురుగు కాలువలను విస్తరించకపోవడం వలన మురుగు నీరు వెనక్కి వస్తున్నాయి. దీంతో టెన్నిస్‌కోర్టు, సబ్ రిజిష్టర్ కార్యాలయం, అగ్నిమాపక కార్యాలయం, మర్చెంట్ క్లబ్, తహసీల్దార్, సబ్ కలెక్టర్, కోర్టు ప్రాంగణాల చుట్టు నీరు నిల్వ చేరుతున్నాయి. అయా పనుల మీద కార్యాలయాలకు వెళ్లే వారు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, గీతా మార్కెట్‌లో నీరు చేరి వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి. ముఖ్యంగా హవన్నపేట, కొడల్ పేట, దండుగేరి, వడ్డేవీధి, బుడ్డేకల్లు ప్రాంతాల్లో వర్షాలు వస్తే నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. ఆవుదూడ పరివాహక ప్రాంతాల్లోని ముంపు సమస్యలతో పాటు వంకలపై సరైన రక్షణ గోడలేక ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మురుగు కాలువలను విస్తరించడమే కాకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులను చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రహదారులు జలమయం అవుతున్నాయి



వర్షంవస్తే చాలు ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో జలమయం అవుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న చిన్న వర్షాలకే ఇలా ఉంటే ఇక పెద్ద వర్షాలు కురిస్తే పరిస్థితి ఏలా ఉంటుందో ఒకసారి ఉహించుకోవచ్చు. కుంచించుకొని పోయిన మురుగు కాలువల నిర్మాణాలను చేపట్టాలి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. వర్షం వస్తే నీరు రహదారుల మీదకు, కాలనీల్లోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

–బి.దస్తగిరి నాయుడు, ఆదోని

కాలువలను విస్తరించాలి



ప్రధాన రహదారుల్లో, కాలనీల్లో మురుగు కాలువలు అక్కడక్కడ కుంచించుకొని పోయాయి. దీనికితోడు చెత్తా చెదారం కాలువల్లో పేరుకు పోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్లకుండా రోడ్ల మీదకు వస్తున్నాయి. జానాభా పెరిగింది. పట్టణం విస్తరించింది. వీటికి అనుగుణంగానే రహదారులతో పాటు మురుగు కాలువల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. మురుగు కాలువల్లో అడపాదడపా పూడికతీత పనులను చేపట్టి చేతులు దులుపుకోవడం వంటి పనులు జరుగుతున్నాయి. దీంతో సమస్య తిరిగి మొదటికే వస్తుంది. – యు.నాగరాజు, ఆదోని

క్లుప్తంగా

శాకాంబరి అలంకారంలో అంబాభవానీ



ఆదోని అర్బన్: పట్టణంలోని శుక్రవారపేటలో పెద్దశక్తిగుడిలో వెలిసిన శ్రీ అంబాభవానీమాతకు శాకాంబరి అలంకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకాంబరిమాతగా అలంకరించారు. అదేవిధంగా ఆలయంలో వెలిసిని శివుడికి పెరుగన్నంతో అలంకరణ చేశారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు


పూజలందుకుంటున్న షిరిడీ సాయి బాబా

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాయి ఋత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ తెలిపారు. వేకువజామున 5.15 గంటల బాబా వారికి కాకడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. సుప్రభాతం, అభిషేకములు, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్ర పఠనం, నిత్య ప్రార్థన పఠనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న హారతి, సాయి చిత్ర పటం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం సంధ్య హారతి, రాత్రి సేజ్ హారతి కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ సాయి నామ సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వీధి కుక్కకు వైద్యం


కుక్కకు సెలెన్ బాటిల్ ఎక్కిస్తున్న యువకుడు

ఆదోని టౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో మూడు రోజుల క్రితం ఓ వీధి కుక్కను కొన్ని కుక్కలు కరిచి గాయపరిచడంతో రోడ్డు పక్కన అపస్మారకసితిలో పడివుంది. కాలనీలోని జీరో రోడ్డులో నివాసముంటున్న ప్రైవేట్ వెటర్నరీ అసిస్టెంట్ నరేష్ కుక్కను గమనించి సెలెన్ బాటిల్ ఎక్కించి వైద్యం చేశారు. సాయంత్రం సమయానికి అపస్మారక స్థితిలో పడి ఉన్న వీధి కుక్క మెలుకువలోకి వచ్చింది.

కస్తూర్బా పాఠశాలకు మైక్‌సెట్ విరాళం


మైక్ సెట్ విరాళంగా ఇస్తున్న మహదేవప్పస్వామి

కౌతాళం: విద్యార్థినులు ఉన్నత ఆశయాలతో చదువును కొనసాగించాలని అప్పుడే మన ఆశయం నెరవేరుతుందని ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు మహదేవప్పస్వామి అన్నారు. కౌతాళంలోని కస్తూరిబా పాఠశాలకు రూ.25వేలు విలువచేసే మైకుసెట్‌ను విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. మహదేవప్పస్వామికి పాఠశాల ప్రత్యేక అధికారిణి పుష్పలత, ఇతర ఉపాధ్యాయురాలు శాలువ పూలమాలతో సన్మానించారు.

ఆటో బోల్తా.. ఇద్దరు విద్యార్థినులకు గాయాలు


గాయపడ్డ విద్యార్థినిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం సాయంత్రం ఆటోకు కుక్క అడ్డురావటంతో అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన విద్యార్థినులు మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాల వదిలిన తరువాత ఆటోలో వెంకటాపురం బయలుదేరారు. రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆటోకు కుక్క అడ్డురావటంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 7వ తరగతి చదువుతున్న స్వరూపకు తీవ్ర గాయాలు, మరో విద్యార్థినికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు మరో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు పరిశీలన

ఆదోని టౌన్: ఆదోని కూటమి ఎమ్మెల్యే పార్థసారథి ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో కలిసి బుధవారం బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును పరిశీలించారు. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు చెరువుగట్టు సుమారు కిలోమీటర్ మేర కుంగిపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని నింపుకోలేకపోతున్నామరు. దీంతో ఆదోనికి తాగునీటి ముప్పు పొంచి ఉందని భావించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువుగట్టు మరమ్మతులకై నిధుల మంజూరు కోసం సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిధుల మంజూరైన తర్వాతనే మరమ్మతు పనులు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులు చేయనున్నామని, వచ్చే యేడాది చివరి నాటికి శాశ్వతమైన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, వాటర్ వర్క్స్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.


చెరువుగట్టుపై పర్యటిస్తున్న ఎమ్మెల్యే, ఇంజనీరింగ్‌శాఖ అధికారులు

మాయమాటలు చెప్పి బైకుతో పరార్

ఆదోని అర్బన్: పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇడ్లీ బండి నిర్వాహకుడు శ్రీధర్‌కు గుర్తు తెలియని దుండగుడు మాయమాటలు చెప్పి బైకును అపహరించాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇడ్లీ బండి పెట్టుకుని శ్రీధర్ అనే వ్యక్తి జీవనం సాగిస్తున్నాడు. గుర్తు తెలియని ఓ యువకుడు వచ్చి తమకు 150 ఇడ్లీలు, వడలు కావాలని శ్రీధర్‌కు చెప్పాడు. సరేనని ఎప్పుడు కావాలని చెప్పడంతో అక్కడ మా అక్కవాళ్లు ఉన్నారు, వెళ్లి ఆర్డర్ తీసుకుని వద్దామని చెప్పి శ్రీధర్ బైకుపై తాళం వేసిన ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. తాళం వేసి బయటకు మా అక్క వెళ్లిందని, తాను పిలుచుకుని వస్తాని బైకు ఇవ్వాలని శ్రీధర్‌ను దుండగుడు కోరాడు. అయితే శ్రీధర్ నమ్మి ఇవ్వడంతో బైకుతో పాటు దుండగుడు పరారయ్యాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో తాను మోసపోయానని తెలుసుకుని శ్రీధర్ వెంటనే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

గోనెగండ్ల : యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చూడాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడమే తప్ప రైతులకు చేసిందేమి లేదన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు యూరియా కొరత ఉండడంతో రైతులు నానావస్థలు పడుతూ అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతులు మునిస్వామి, ఈరన్న, రంగస్వామి, శంకరయ్య, హనుమంతు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు

15 లోపు పంటల బీమా చేయించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు తమ పంటలకు ఈ నెల 15వ తేదీలోపు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మదిరేపల్లి శివశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్ పురం, ఎమ్మిగనూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాలు ఎంపిక, నాణ్యత ప్రమాణాలను తెలుసుకొని విత్తుకోవాలన్నారు. బయట వ్యక్తుల వద్ద విత్తనాల కొనుగోలు చేయకుండా డీలర్ల వద్ద షాప్స్‌లో కొని బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతులకు యూరియా పుష్కలంగా దొరుకుంతుందని, ఎవరు అందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహం, జగదీష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కడిమెట్ల సోసైటీలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

ఆదోని రూరల్: ప్రధానమంత్రి మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె విజయవంతమయ్యిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు పి.ఈరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ఉద్యోగ సంఘాలు ఎల్ఐసీ కార్యదర్శి ప్రకాష్ తదితరులు తెలిపారు. ఆదోని పట్టణ ప్రధాన రహదారిపై వారు ధర్నా చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆదోని సెంట్రల్: సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి రవి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా వామపక్ష పార్టీ నాయకులు జయరాజు, భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అంగన్‌వాడీ యునియన్ నాయకురాలు నిరసన కార్యక్రమం చేపట్టారు.

కౌతాళం: మండలకేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జయలక్ష్మి, అధ్యక్షతన ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు.

కోసిగి: మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు రాముడు, వీరేష్ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో కార్మికుల మెడలకు ఉరితాళ్లు బిగించిన ప్రధాని నరేంద్రమోదీ వేషధారి

నందవరం : మండల కేంద్రంలో సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్, ఎస్ఎఫ్ఐ, పీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆ సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా మానవహారం చేపట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు గురుశేఖర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక టీటీడీ కళ్యాణ మండపం నుంచి ప్రధాని మోడీ వేషధారి కార్మికుల మెడలకు ఉరితాళ్లు బిగించి ర్యాలీ చేపట్టారు. నాయకులు తిమ్మగురుడు, ప్రసాద్, పంపణ్ణ గౌడ్, రంగన్న పాల్గొన్నారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, యూటీఎఫ్, రైతు సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గోవిందు, రాముడు, బాలరాజు, నాగమణి పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల కేంద్రల్లో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఎండీ ఆనంద్ బాబు, నాయకులు నబీ రసూల్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఎన్టీఆర్ కాలనీలో చివరి వీధిలో ఎమ్మెల్యే సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు వేయించారు. దీంతో కాలనీ వాసులు రాజు, నరేష్, పద్మ,రాజేశ్వరిలతో పలువురు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో చివరి ఉంటూ రాత్రిళ్లు వీధిలైట్లు లేక అంధకారంలో నరకయాతన అనుభవించేవాళ్లమన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి సొంత నిధులతో స్తంభాలు ఏర్పాటు చేసి, లైట్లు ఏర్పాటు చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాడుగేని నాగరాజు, బుడగజంగాల అయ్యప్ప, గ్యాంగ్ ఈరన్నలు ఉన్నారు.

సచివాలయాల్లో టిడ్కో లబ్ధిదారుల జాబితా

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోన టిడ్కో లబ్ధిదారుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించామని, జాబితాలోని పేర్లను పరిశీలించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టిడ్కో పరిధిలో మొత్తం 4,720 ప్లాట్లను ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో 4,208 ప్లాట్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన 512 ప్లాట్లు బ్యాంకు రుణాల ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. కొంతమంది లబ్ధిదారులకు వివిధ కారణాల చేత రుణాలు తిరస్కరించబడ్డాయని, అందుకు గల కారణాలను కూడా సచివాలయాల్లోని జాబితాలో ప్రదర్శించినట్లు తెలిపారు. లబ్ధిదారులు 15 రోజుల్లోగా రద్దు అయిన విషయాలపై రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని సెంట్రల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఏబీవీపీ నాయకులు ఆదోని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కర్నూలు జిల్లా కన్వీనర్ వీరేష్, నగర కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోవింద్, పూర్వ కార్యకర్తలు సుధాకర్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయండి

నందవరం: మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో హెల్త్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులతో ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో శానిటైషన్, తాగునీరు, ఆరోగ్యం, విద్యుత్ దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పంచాయతీలకు ఆదాయం సమకుర్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రఘునాథ్, పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పీఆర్ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఆదోని రూరల్: కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామంలో దళితులైన కృష్ణయ్య, గోవర్ధన్‌లపై విచక్షణారహితంగా దాడి చేసిన గౌస్, అతని కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేవీపీఎస్ ఆదోని మండల అధ్యక్ష కార్యదర్శులు మునిస్వామి, బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ ప్రతినిధి బృందం ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణయ్యను పరామర్శించారు. వారు మాట్లాడుతూ బతుకుదెరువు కోసం బళ్లారికి వెళ్లి అక్కడే నివాసముంటూ తన తమ్ముడి అవసరం కోసం డబ్బులు ఇచ్చేందుకు కుంటనహాల్‌కు వచ్చిన కృష్ణయ్యను దారిలో వెళ్తుండగా అడ్డగించి గౌస్ విచక్షణారహితంగా దాడి చేసి డబ్బులను లాక్కున్నాడన్నారు. కేవీపీఎస్ నాయకులు లక్ష్మణ్, తాయన్న, వెంకటేష్, నాగప్ప, అయ్యన్న, గర్జప్ప పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా చేపట్టండి

మంత్రాలయం రూరల్ : ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ బూత్ లెవల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బీఎల్ఓలు విధులు పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటి స్థితిగతులను వివరించాలన్నారు. అలాగే గ్రామాల్లో 1200 మంది ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డీటీ గురురాజురావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

యూరియా అక్రమ నిల్వపై విచారణ


పెద్దమరివీడు టీడీపీ నేత గోదాములో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన టీడీపీ నేత గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన యూరియాపై బుధవారం వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టారు. ×టీడీపీ నేత గోదాములో యూరియా అక్రమ నిల్వ₹ అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయ అధికారులు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత బుధవారం పెద్దమరివీడు గ్రామానికి వెళ్లి విచారించారు. రైతు సేవా కేంద్రానికి ఇప్పటి వరకు యూరియా ఎంత స్టాక్ వచ్చింది. ఎన్ని బస్తాలు యూరియా రైతులకు విక్రయించారని సిబ్బందిని విచారించారు. అలాగే రిజిష్టర్, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. అలాగే కొనుగోలు చేసిన రైతులను ఎన్ని బస్తాలు కొనుగోలు చేశారని విచారించారు. అనంతరం టీడీపీ నేత, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య గోదాముకు వెళ్లి తనిఖీ చేశారు. గోదాములో ఎంత యూరియా స్టాక్ ఉంది, ఎక్కడ నుంచి తీసుకున్నారని మల్లయ్యను విచారించారు. రికార్డులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏడీఏ తెలిపారు.

యురియా కొరత సృష్టిస్తే చర్యలు

నందవరం : యురియా కృతిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని రైతు సేవ కేంద్రాల సిబ్బందికి, డీలర్లకు ఏఓ సరిత హెచ్చరించారు. ×యురియాను తమ్ముళ్లు పంచుకున్నారు₹..అనే శీర్షిక సాక్షిలో వార్త రావడంతో బుధవారం వ్యవసాయ అధికారిణి మండలంలోని గురజాల గ్రామంలో రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాను ప్రదర్శించారు. అవసరమైన రైతులకు వీఏఏలు అందుబాటులో ఉండి ఎరువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. కృతిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరుటౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. బుధవారం పట్టణంలోని దీక్ష కళాశాలలో శక్తిటీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, శక్తియాప్, విద్యార్థినుల ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రతలు, ఈవ్‌టీజింగ్, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువు కోసం మాత్రమే సెల్ ఫోన్ ఉపయోగించాలని సూచించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేస్తే తమకు విద్యార్థినులు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా వుంచి తగిన చర్యలు తీసుకొంటామన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా వుండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, శక్తిటీం ఏఎస్ఐ నటరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

సత్ప్రవర్తనను అలవర్చుకోవాలి

నందవరం : విద్యార్థులు పాఠశాల దశ నుంచే సత్ప్రవర్తన కలిగి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఎస్ఐ ఎం కేశవ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ రాజు, ఉపాధ్యాయులు బసవరాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ఆదోని అర్బన్: పట్టణంలోని కల్లుబావి సమీపంలోని ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన బజారి చిన్నకుమారుడు లాజర్(18) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. లాజర్ ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంట్లో పైకప్పు కొండికి ఉరి వేసుకోగా బంధువులు గమనించిన వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు.

మౌలాలి పీర్ల ఊరేగింపు



భక్తిశ్రద్ధలతో మౌలాలి పీర్ల షహదత్


150కిలోల రాతి గుండు ఎత్తిన రహంతుల్లా

ఎమ్మిగనూరుటౌన్: మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని పెద్ద కటిక వీధిలో బుధవారం షహదత్‌తో మౌలాలి పీర్ల వేడుకలు ముగిసింది. ఇందులో భాగంగా భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చున్నారు. అనంతరం పీర్లను ఊరేగింపు నిర్వహించారు. భాగంగా పీర్ల చావిడీ వద్ద పలువురు యువకులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 150కిలోల రాతి గుండును రహంతుల్లా అనే యువకుడు ఎత్తి షభాష్ అనిపించుకున్నాడు.